## క్లుప్తంగా

### నేడు సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి

**రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు**

**పటాన్‌చెరు టౌన్‌:** సోమవారం సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి సందర్భంగా పట్టణంలోని శ్రీ రామలింగేశ్వర దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ అర్చకుడు మహేశ్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు చేస్తామని చెప్పారు.

### భక్తి శ్రద్ధలతో నగర సంకీర్తన



నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

**జహీరాబాద్‌ టౌన్‌:** పట్టణంలోని నాగులకట్ట ప్రాంతంలో హరేరామ హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన నగర సంకీర్తనకు మంచి స్పందన వచ్చింది. భక్తులు భక్తి శ్రద్ధలతో భజనలు, కీర్తనలు ఆలపిస్తూ పాదయాత్ర నిర్వహించారు. ప్రధాన రహదారి నుంచి ప్రారంభమైన నగర సంకీర్తన గుండా హనుమాన్‌ మందిరం నుంచి నాగులకట్ట వరకు కొనసాగింది. కార్యక్రమంలో మహిళలు, పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### యువతకు చేయూత



నియామక పత్రాలను అందిస్తున్న జైపాల్‌రెడ్డి

**జిన్నారం(పటాన్‌చెరు):** యువతకు చేయూతను అందించేలా కాంగ్రెస్‌ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని బొల్లారం మున్సిపల్‌ కాంగ్రెస్‌ అధ్యక్షులు జైపాల్‌రెడ్డి అన్నారు. మున్సిపల్‌ పరిధిలో ఆదివారం నిర్వహించిన ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడుగా శివకుమార్‌, తారకేశ్‌, ప్రధాన కార్యదర్శిగా కిషోర్‌తో పాటు పలువురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. దానికి సంబంధించిన నియాయక పత్రాలను జైపాల్‌రెడ్డి వారికి అందజేశారు.

### పథకాలను వినియోగించుకోవాలి

**కంది(సంగారెడ్డి):** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ విశ్వప్రసాద్‌ సూచించారు. ఆదివారం కంది మండలంలోని కాశిపూర్లో వికసిత్‌ భారత్‌ సంకల్పయాత్ర కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కేంద్రం అమలుచేస్తున్న 17 పథకాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎంపీఓ మహేందర్‌ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### గీతంలో అంతర్జాతీయ సదస్సు

**పటాన్‌చెరు టౌన్‌:** గీతం స్కూల్‌ ఆఫ్‌ బిజినెస్‌ ఆధ్వర్యంలో 'పర్యావరణ, సమాజం, పరిపాలనలో (ఈఎస్‌జీ) సమకాలీన సమస్యలు' అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును ఫిబ్రవరి 16, 17న నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈఎస్‌జీ ప్రముఖ్యత, పర్యావరణం, సమాజం, ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం గురించి అవగాహన పెంచడం ఈ సదస్సు లక్ష్యంగా పేర్కొన్నారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్‌ గోయల్‌ను ముఖ్య అతిథిగా పాల్గొనాలని కోరినట్టు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు జనవరి 31 లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 95429 78515 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

**మునిపల్లి(అందోల్‌):** ఎంపీపీ శైలజ, జెడ్పీటీసీ మీనాక్షి, ఎంపీడీఓ హరినందన్‌రావు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం ఉదయం జరగనున్న ఈ సమావేశానికి ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారు.

**విధిగా హాజరు కావాలి..**

**జోగిపేట (అందోల్‌):** మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు అందోల్‌ ఎంపీడీఓ సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశ మందిరంలో ఎంపీపీ జోగు బాలయ్య అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి ఆయా శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఎంపీవో కోరారు.

### దివ్యాంగుల జిల్లాస్థాయి క్రీడలు

**జహీరాబాద్‌ టౌన్‌:** జిల్లా కేంద్రం సంగారెడ్డిలో మంగళవారం నిర్వహించనున్న దివ్యాంగుల జిల్లాస్థాయి క్రీడల్లో దివ్యాంగులు పాల్గొనాలని జాతీయ దివ్యాంగుల హక్కుల వేదిక నియోజకవర్గం అధ్యక్షుడు కొనింటి నర్సింలు పిలుపునిచ్చారు. అంబేద్కర్‌ స్టేడియంలో మహిళా శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తారని చెప్పారు.

# ఆకర్షణీయం.. అయ్యప్ప ఆలయం

- ప్రతి ఏటా ప్రత్యేక పూజలు
- నిత్యం భక్తుల కోలాహలం
- వందలాది మందికి మాల ధారణలు



అయ్యప్ప దేవాలయం

**జిన్నారం(పటాన్‌చెరు):** గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి గ్రామంలో 15 ఏళ్ల క్రితం నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శబరిమలలోని స్వామి దేవాలయం తీరుగా ఆ ఆలయ నిర్మాణం ఉండడం ప్రత్యేకత. ప్రతి ఏటా ఆలయంలో వందల సంఖ్యలో భక్తులు అయ్యప్పను దర్శించుకుంటారు. వేలాది మంది మాలధారణ చేస్తుంటారు.

గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి గ్రామం హైదరాబాద్‌కు కేవలం 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. గ్రామంలో అయ్యప్పస్వామి దేవాలయాన్ని 15 ఏళ్ల క్రితం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. శబరిమల దేవాలయంలో ఉన్నట్టే 18 మెట్లు ఏర్పాటు చేయడం ప్రత్యేకత సంతరించుకుంది. ఈ ఆలయానికి దగ్గరలోనే శైవ క్షేత్రాల్లో ఒకటైన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయం కూడా ఉంది. ఆ ఆలయానికి సుమారు వెయ్యి ఏళ్ల చరిత్ర ఉంది.

**సుమారు 1000 మంది మాల ధారణ..**

ప్రతి ఏటా వెయ్యి మంది ఈ దేవాలయంలో అయ్యప్ప మాల ధరిస్తుంటారని అంచనా. ఆ సమయంలో సుమారు ఐదు వందల మంది మాల ధారులు ఈ ఆలయంలోనే ఉంటుంటారు. ప్రతి నిత్యం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. అయ్యప్ప పూజ జరిగే ప్రతి ఏటా రెండు గద్దలు వచ్చి ఆకాశంలో సంచరిస్తుంటాయి. అది అద్భుతంగా చెప్పుకుంటారు. ఆలయం వద్దే సాయి బాబా, శివాలయాలు కూడా ఉన్నాయి. కనువిందుచేసే ఈ ఆలయాలు, పక్కనే ఉన్న చెరువు అందాలను భక్తులు ఆస్వాదిస్తుంటారు. స్థానికంగా ఉన్న పరిశ్రమలు, రాజకీయ నాయకులు, భక్తులు అందించే విరాళాలతో దేవాలయంతో పాటు పరిసర ప్రాంతాలను స్థానిక నాయకులు అభివృద్ధి చేస్తున్నారు.

**ఆలయ అభివృద్ధికి మరింత కృషి**



ఇక్కడి అయ్యప్ప దేవాలయానికి చాలా ప్రత్యేకత ఉంది. ప్రతి ఏటా స్వామి సన్నిధిలో వేల సంఖ్యలో భక్తులు అయ్యప్ప మాలలు ధరిస్తారు. అయ్యప్పస్వామి ఆలయంతో పాటు మిగతా దేవాలయాలను మరింత అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– నాగేందర్‌గౌడ్‌, గురుస్వామి, బొంతపల్లి

## చెత్త సేకరణపై అధికారుల నిర్లక్ష్యం



ఆలయ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

**ఝరాసంగం(జహీరాబాద్‌):** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయ ఆవరణలో చెత్త సేకరణపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయానికి దర్శనార్థం తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. ఆలయ పరిసరాల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లడంతో ఇబ్బందులు పడుతున్నామని భక్తులు వాపోతున్నారు. అధికారుల పని తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## అయ్యప్ప ఆలయంలో మహా అన్నదానం



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** బీహెచ్‌ఈఎల్‌ కాలనీలోని అయ్యప్ప ఆలయంలో ఆదివారం 56వ మండలి పూజ ఘనంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనతరం జరిగిన మహా అన్నసమారాధనలో అధిక సంఖ్యలో స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

### బోరంచ పోచమ్మకు ఎమ్మెల్యే దంపతుల పూజలు

**మనూరు(నారాయణఖేడ్‌):** జిల్లాలో ప్రసిద్ధి చెందిన బోరంచ నల్లపోచమ్మను ఎమ్మెల్యే దంపతులు డాక్టర్‌ పట్లోళ్లసంజీవరెడ్డి, అనుపమారెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారిని సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### అభివృద్ధిపై నేడు సమీక్ష

**నారాయణఖేడ్‌:** మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తున్నట్టు కమిషనర్‌ మల్లారెడ్డి తెలిపారు. చైర్మన్‌, వైస్‌ చైర్మన్‌, కౌన్సిల్‌ సభ్యులు, సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే డాక్టర్‌ పట్లోళ్ల సంజీవరెడ్డి సమీక్ష నిర్వహిస్తారని, సంబంధిత అధికారులు, సకాలంలో హాజరవ్వాలని ఆయన కోరారు.

### ఉచిత వైద్య పరీక్షలు

**జిన్నారం(పటాన్‌చెరు):** జిన్నారంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆదివారం జెడ్పీవైస్‌ చైర్మన్‌ ప్రభాకర్‌ శిబిరాన్ని ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో వైద్యులు పలవురికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

### ● వృథాగా 'భగీరథ'



మిషన్‌ భగీరథ నీరు వృథాగా పోతోంది. మండలంలోని తాటిపల్లి గ్రామ శివారులో ఆదివారం మిషన్‌ భగీరథ పైపులైన్‌ పగిలిపోవడంతో తాగునీరు డబ్బవాగులోకి పోతోంది. మునిపల్లి మండలంలోని తాటిపల్లి, పెద్దలోడి, గార్లపల్లి, చీలపల్లి, మక్తక్యాసారం, పిల్లోడి, రాయికోడ్‌ మండలంలోని ఆయా గ్రామాలకు భగీరథ పైపులైన్‌ ద్వారా తాగునీరు సరఫరా అవుతుంది. అయితే పైపు పగిలిపోవడంతో కొన్ని గ్రామాలు నీటి సరఫరాలో అవరోధం కలిగింది. సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేసి ప్రజలకు తాగునీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- మునిపల్లి(అందోల్‌)

### విశ్వకర్మ యోజన పథకంతో అభివృద్ధి

**బీజేపీ నాయకులు**

**జహీరాబాద్‌:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్‌, రాష్ట్ర నాయకుడు ఎం.జైపాల్‌రెడ్డి కోరారు. ఆదివారం జహీరాబాద్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పథకంపై విశ్వకర్మలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుధీర్‌ భండారి, శ్రీనివాస్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

**20న సమావేశం**

**నారాయణఖేడ్‌:** మంగల్‌పేట్‌లోని బీజేపీ కార్యాలయంలో 20న విశ్వకర్మయోజన పథకానికి సంబంధించి నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు బీజేపీ ఓబీసీమోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు, విశ్వకర్మ యోజన సమన్వయకర్త సాయిరాం తెలిపారు. ముఖ్య అతిథులుగా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్‌రాజ్‌, ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్‌ హాజరవుతున్నారని వివరించారు.

### ఎమ్మెల్సీ రాజుకు మాలధారుల ఆహ్వానం



ఎమ్మెల్సీ రాజుతో మాలధారులు

**జిన్నారం(పటాన్‌చెరు):** జిన్నారం మండలంలోని గడ్డపోతారం గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌ పార్టీకి చెందిన అయ్యప్ప మాలధారులు ఎమ్మెల్సీ శంభీపూర్‌ రాజును ఆదివారం కలిశారు. గ్రామంలో నిర్వహించే అయ్యప్పస్వామి పూజలకు హాజరు కావాలని అయ్యప్ప స్వాములు ఆయనను ఆహ్వానించారు.





బహుమతి అందజేస్తున్న శంకర్‌పాటిల్‌ తదితరులు

## ఉల్లాసంగా పిల్లల పండగ

**పాల్గొన్న 2,500 మంది విద్యార్థులు**

**జహీరాబాద్‌ టౌన్‌:** పట్టణంలో 'పిల్లల పండగ' కార్యక్రమం ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగింది. చిల్డ్రన్స్‌ ఫెస్ట్‌ కమిటీ, గ్రామిక్‌ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఆదర్శ విద్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్రీయ బసవదళ్‌ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌పాటిల్‌ హాజరయ్యారు. 76 పాఠశాలల నుంచి సుమారు 2,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. చిన్నారులకు చిత్రలేఖనం, ఫ్యాన్సీ డ్రెస్‌, పద్యాలు ఆలపించడం, మట్టి బొమ్మల తయారీ, కథారచన, రన్నింగ్‌, స్కిపింగ్‌, ఏకపాత్రాభినయం, జానపద గీతాలాపన, క్లాసిక్‌ డ్యాన్స్‌, మూజిక్‌, జానపద నృత్యం వంటి పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా.. ఉల్లాసంగా పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా చిన్నవీరభద్రుడు, వీఆర్‌ శర్మ, అరమవాది నీరజ, ఆర్టిస్టు అన్వర్‌ వ్యవహరించారు. విజేతలకు ముఖ్యఅతిథి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్‌ డాక్టర్‌. విజయలక్ష్మి, గ్రామిక్‌ విజ్ఞాన కేంద్రం మేనేజింగ్‌ ట్రస్టీ బి.రాంచందర్‌, కార్యదర్శి డా.కె.శివబాబు, ఆర్గనైజింగ్‌ కమిటీ సభ్యులు అశోక్‌ సిరిసి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

### శ్రీరామ అక్షితల శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న స్వామీజీలు

**సంగారెడ్డి టౌన్‌:** అయోధ్య శ్రీరామ అక్షితలు పట్టణంలోని మాధవసదన్‌కు చేరుకున్నాయి. ఆ అక్షింతలను జిల్లాలోని మండల కేంద్రాలకు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాధవసదన్‌లో అక్షింతలకు స్వామీజీలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక సంజీవనీ హనుమాన్‌ ఆలయం వరకు అక్షింతల కలశాలతో శోభాయాత్రను జరిపి ఆంజనేయ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కొండాపూర్‌ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్‌, దుద్యాల పీఠాధిపతి అంబిక శివయోగి, తంగెడుపల్లి ఆశ్రమ పీఠాధిపతి శ్రీశివయోగిస్వామి, విశ్వానంద దత్తగిరి స్వామి, విశ్వహిందూ పరిషత్‌ రాష్ట్ర కార్యదర్శి పండరినాథ్‌ తదితరులు పాల్గొన్నారు.

### రక్తదానంతో ప్రాణదానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ చంద్రయ్య

**సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి):** రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని కొండాపూర్‌ సీఐ చంద్రయ్య అన్నారు. మండల పరిధిలోని ఆత్మకూర్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆత్మకూర్‌ బ్లడ్‌ డోనర్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదానం చేసేందుకు యువత ముందు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌ గంగన్న, నాయకులు జయరాజ్‌, రమేశ్‌, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీకాకుళం సంఘం నూతన కమిటీ



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న సభ్యులు

**పటాన్‌చెరు టౌన్‌:** శ్రీకాకుళం సంఘం పటాన్‌చెరు నియోజకవర్గం అధ్యక్షుడిగా డాక్టర్‌ నాగేశ్వరరావును సంఘం సభ్యులు ఆదివారం ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం సంఘం అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా సురేశ్‌, కోశాధికారిగా శాంతారావు, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌గా వాసుదేవరావును ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆయనను సంఘం సభ్యులు భాస్కర్‌ తదితరులు సన్మానించారు.

### ఘనంగా పెన్షనర్స్‌ డే



పింఛనుదారులను సన్మానించిన సంఘం నాయకులు

**జహీరాబాద్‌ టౌన్‌:** స్థానిక టీఎన్జీవోస్‌ భవనంలో ఆదివారం విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్స్‌ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పింఛనుదారులు, వయోవృద్ధులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించారు. పలువురు వృద్ధులు, పింఛనుదారులను సన్మానించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గడ్డం జనార్దన్‌, ప్రధాన కార్యదర్శి రాజేందర్‌రావు పాటిల్‌, కోశాధికారి రమేశ్‌బాబు, నాయకులు బస్వరాజ్‌, నర్సింలు, సంగమేశ్వర్‌ తదితరులు పాల్గొన్నారు.

# అవిశ్వాస అస్త్రం.. ఆదిలోనే విఫలం

- కాంగ్రెస్‌లోకి ఇద్దరు ఎంపీటీసీలు
- అధ్యక్షురాలికి పెరిగిన బలం
- నేడు ఖేడ్‌ మండల సభ

**నారాయణఖేడ్‌:** శాసనసభ ఎన్నికల అనంతరం నారాయణఖేడ్‌ మండల పరిషత్తు అధ్యక్షురాలు చాందీబాయి చౌహాన్‌పై బీఆర్‌ఎస్‌ ప్రయోగించిన అవిశ్వాసం అస్త్రం ఆదిలోనే విఫలమైంది. బీఆర్‌ఎస్‌కు చెందిన ఇద్దరు ఎంపీటీసీలు ఎమ్మెల్యే డాక్టర్‌ సంజీవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌ కండువా కప్పుకోవడంతో అధ్యక్షురాలు చాందీబాయి పైచేయి సాధించినట్టయింది. దీంతో మరో ఆరు నెలలపాటు ఉన్న పదవీ కాలానికి ఢోకా లేకుండా పోయింది.

**అవిశ్వాసంపై నోటీసు**

నారాయణఖేడ్‌ మండల పరిషత్తు అధ్యక్షురాలు చాందీబాయిపై బీఆర్‌ఎస్‌కు చెందిన 12 మంది ఎంపీటీసీల పేర్లతో ఈ నెల 14న ఆర్డీఓ కార్యాలయంలో డీపీవో రత్నంకు అవిశ్వాసంపై నోటీసును అందజేశారు. దీనిపై స్పందించిన ఎంపీపీ చాందీబాయి తనపై అవిశ్వాసం ప్రవేశపెట్టాలంటే నిబంధనల ప్రకారం 12 మంది ఎంపీటీసీలు ఆర్డీఓ సమక్షంలో సంతకాలు చేయాలని పేర్కొన్నారు. అయితే బీఆర్‌ఎస్‌ నేతలు కొందరి సంతకాలు ఫోర్జరీచేసి నోటీసు ఇచ్చారని, అది చెల్లదని ప్రకటించారు. ఆ 12 మంది ఎంపీటీల్లో ఇద్దరు ఎంపీటీసీలు తాజాగా కాంగ్రెస్‌ తీర్థం పుచ్చుకున్నారు. ఇక అవిశ్వాస ప్రక్రియ ఆదిలోనే హంసపాదులా మారింది.

**సభపై ఉత్కంఠ?**

సోమవారం మండల పరిషత్తు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నారు. మండల సభ కొనసాగాలంటే మండలంలో ఉన్న 18 మంది ఎంపీటీల్లో మూడో వంతు ఏడుగురు హాజరవ్వాలి. ఇద్దరు ఎంపీటీసీల చేరికతో కాంగ్రెస్‌ బలం 8కి చేరింది. సభ నిర్వహణకు కోరం సరిపోనుంది. అదే అవిశ్వాసానికి 18 మందిని నాలుగు భాగాలుగా మార్చితే అందులో మూడో వంతు సభ్యులు అంటే 12 మంది బలం కావాల్సి ఉంది. ప్రస్తుతం ఆ బలం బీఆర్‌ఎస్‌కు లేదు.



ఎమ్మెల్యే సంజీవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఇద్దరు బీఆర్‌ఎస్‌ ఎంపీటీసీలు

**కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్‌ ఎంపీటీసీలు**

కాంగ్రెస్‌ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమంతో పాటు అభివృద్ధికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్‌ సంజీవరెడ్డి తెలిపారు. బీఆర్‌ఎస్‌కు చెందిన ఖేడ్‌ మండలం పైడిపల్లి ఎంపీటీసీ స్వప్న సురేశ్‌, తుర్కాపల్లి ఎంపీటీసీ అశోక్‌రెడ్డి ఆదివారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్‌ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌ నాయకులు రమేశ్‌ చౌహాన్‌, బాపు మల్‌శెట్టి, మల్లేశ్‌యాదవ్‌, గోవింద్‌రాథోడ్‌, నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారంతా ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

**పదవికి నో ఢోకా..**

మండలంలో బీఆర్‌ఎస్‌ తరపున 14 మంది ఎంపీటీసీలు, కాంగ్రెస్‌ నుంచి ముగ్గురు, స్వతంత్రులు ఒకరు గెలుపొందారు. బీఆర్‌ఎస్‌కు చెందిన ర్యాకల్‌ ఎంపీటీసీ సభ్యురాలు చాందీబాయి చౌహాన్‌ను ఎంపీపీగా ఎన్నుకున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఎంపీపీ అధ్యక్షురాలు చాందీబాయి చౌహాన్‌ సత్తెగామ ఎంపీటీసీ సరోజనితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా తుర్కాపల్లి ఎంపీటీసీ అశోక్‌రెడ్డి, పైడిపల్లి ఎంపీటీసీ స్వప్న సురేశ్‌ కాంగ్రెస్‌లో చేరారు. ర్యాలమడుగు నుంచి స్వతంత్రంగా గెలుపొందిన మోతీబాయి సైతం కాంగ్రెస్‌లోనే ఉన్నారు. దీంతో ప్రస్తుతం కాంగ్రెస్‌ బలం 8 మందికి పెరిగింది. బీఆర్‌ఎస్‌కు 10 మంది ఎంపీటీసీలు ఉన్నారు. అధ్యక్షురాలిపై అవిశ్వాసం ప్రవేశ పెట్టాలంటే 12 మంది ఎంపీటీసీల మద్దతు అవసరం ఈ లెక్కన ఎంపీపీ చాందీబాయిపై బీఆర్‌ఎస్‌కు అవిశ్వాసం ప్రవేశపెట్టే 12 మంది ఎంపీటీసీల బలం లేకుండా పోయింది. ఇక అధ్యక్షురాలి పదవి పదిలం ఐనట్టే. బీఆర్‌ఎస్‌ పథకం ఆదిలోనే అభాసుపాలైందని చర్చసాగుతోంది.